


జనగామ మండలం పసరమడ్లలో ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ముస్లింలు. ఓటును అభ్యర్థిస్తున్న పల్లా. చిత్రంలో హోంమంత్రి మహమూద్ అలీ, బీఆర్ఎస్ నాయకుడు పొన్నాల

# కాంగ్రెస్‌తో దగా పడ్డ మైనారిటీలు

- అధికారం కోసం పార్టీలు మారుతున్న రేవంత్
- గ్యారెంటీ లేని కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు నెరవేరుస్తదా?
- జనగామ, కోస్గి సభల్లో మంత్రి మహమూద్ అలీ

జనగామ రూరల్/కొడంగల్/కోస్గి, నవంబర్ 13 : కాంగ్రెస్ హయాంలో మైనారిటీలు ఎంతో దగాకు గురయ్యారని, ఎటువంటి అభివృద్ధి లేకుండా అన్నింటా వెనుకబడినట్టు హోం మంత్రి మహమూద్ అలీ విమర్శించారు. ఆదివారం జనగామ మండలం పసరమడ్ల గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్యతో కలిసి ముస్లింల ఆత్మీయ సమావేశం, సోమవారం కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో కలిసి మైనారిటీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ రెండు సమ్మేళనాలకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ.. యాభై ఏండ్లు అధికారాన్ని చెలాయించిన కాంగ్రెస్ మైనారిటీల అభ్యున్నతికి చేసిందేమీ లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ వైఖరి కారణంగా మైనారిటీలు ఆర్థికంగా, విద్యాపరంగా ఎటువంటి అభివృద్ధిని సాధించలేక పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ పేదంటి మైనారిటీ బిడ్డ వివాహానికి షాదీముబారక్ అందిస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ కాలంలో పదుల్లో గురుకులాలు ఏర్పాటు కాగా బీఆర్ఎస్ వందల సంఖ్యలో గురుకులాలు మంజూరు చేయడంతో నిరుపేద మైనారిటీలు నాణ్యమైన కార్పొరేట్ తరహా విద్యను అభ్యసిస్తున్నట్టు చెప్పారు. 2,520 మంది మైనారిటీ పేద విద్యార్థులు మెడిసిన్, ఇంజినీరింగ్ వంటి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నట్టు పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి అధికారాన్ని దక్కించుకునేందుకు పార్టీలు మారుతున్నాడని, ప్రజా సంక్షేమంపై ఆయనకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ముస్లింలు కేసీఆర్‌కు అండగా ఉండి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. జనగామలో పల్లా రాజేశ్వర్‌రెడ్డిని, కొడంగల్‌లో పట్నం నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



కారుగుర్తుకు ఓటేయాలని పూల వ్యాపారిని అభ్యర్థిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## కాంగ్రెస్, బీజేపీని నమ్మితే మోసపోతాం

**ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

మహబూబ్‌నగర్ టౌన్, నవంబర్ 13 : కాంగ్రెస్, బీజేపీని నమ్మితే మోసపోతామని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్‌లో పదేండ్లలో చేపట్టిన అభివృద్ధి వల్లే వ్యాపారాలు ఎన్నోరెట్లు పెరిగాయని పేర్కొన్నారు. సోమవారం మాజీ మంత్రి పీ చంద్రశేఖర్‌తో కలిసి మహబూబ్‌నగర్‌లోని రాంమందిర్‌చౌరస్తా, పాన్‌చౌరస్తా, క్లాక్‌టవర్ చౌరస్తా వద్ద వ్యాపారుల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం క్లాక్‌టవర్ వద్ద కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ తరహా మహబూబ్‌నగర్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఐటీ టవర్, అమర రాజా లిథియం గిగా పరిశ్రమ ద్వారా వేలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు.

## ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయద్దు

- చెన్నూర్ అసెంబ్లీ అభ్యర్థి, విప్ బాల్కసుమన్

చెన్నూర్, నవంబర్ 13: కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ తనపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదని, ఆధారాలు లేకుండా మాట్లాడొద్దని కాంగ్రెస్ అభ్యర్థి వివేక్‌పై చెన్నూర్ అసెంబ్లీ అభ్యర్థి, విప్ బాల్కసుమన్ విరుచుకుపడ్డారు. వేల కోట్ల ఆస్తులున్న వ్యక్తి తనపై అవినీతి ఆరోపణలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. మీ వద్ద ఆధారాలుంటే బయట పెట్టి మట్లాడాలని సవాల్ విసిరారు. సోమవారం ఆయన మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని ఐబీ చౌరస్తాలో బీఆర్ఎస్ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. వివేక్ ఆస్తులు ఈ రోజు రూ. 606కోట్లు ఉన్నట్టు అఫిడవిట్‌లో చూపారని, ఈ ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. వాళ్ల నాన్న వెంకటస్వామి ఈ ప్రాంతం నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఏమి లేదని, అలాంటి వారు ఇప్పుడు వందలు, వేల కోట్లు ఎలా సంపాదించారని నిలదీశారు. మొదటి నుంచి వాళ్లు ఏమైనా శ్రీమంతులా..? అని ప్రశ్నించారు. తాను తెలంగాణ ఉద్యమంలో నిప్పులెక్క బతికానని, పదేళ్లుగా నిజాయితీగా ప్రజలకు సేవ చేస్తున్నాని స్పష్టం చేశారు. అంతకు ముందు చెన్నూర్ పట్టణంలోని చింతగూడెం, బట్టిగూడెం, లక్ష్మీదేవరవాడతోపాటు లంబడిపల్లి గ్రామానికి చెందిన 400 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరగా, వారికి బాల్క సుమన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



బీఆర్ఎస్‌లో చేరిన యువకులతో ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్

## యాభై ఏండ్ల దరిద్రం కావాలా?
# పదేండ్ల అభివృద్ధి కావాలా?

- బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటేస్తే పెన్షన్లు, కరెంట్ మాయం
- అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ బీఆర్ఎస్సే రావాలి
- బీఆర్ఎస్ కరీంనగర్ అభ్యర్థి, మంత్రి గంగుల



సోమవారం కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంటలో మంత్రికి గొంగడి కప్పి గొర్రె పిల్లను బహూకరిస్తున్న యాదవ కులస్థులు

కొత్తపల్లి, నవంబర్ 13 : 'యాభై ఏండ్ల పాటు మనం అనుభవించిన దరిద్రం మళ్లీ కావాలా? లేదా పదేండ్లలో జరిగిన అభివృద్ధి కావాలా? కాంగ్రెస్, బీజేపీకి ఓటేస్తే మళ్లీ కరెంట్ కష్టాలు, నీటి గోసలు తప్పవు' అని బీఆర్ఎస్ కరీంనగర్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ హెచ్చరించారు. సోమవారం ఆయన కరీంనగర్ నియోజకవర్గ పరిధిలోని కొత్తపల్లి మండలం చింతకుంటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. అనంతరం ఆయాచోట్ల మంత్రి మాట్లాడుతూ.. పదేండ్లుగా జరుగుతున్న అభివృద్ధి కొనసాగడంతో పాటు మరింత అభివృద్ధి జరగాలంటే రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే కచ్చితంగా రావాలని సూచించారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ కరెంటు కష్టాలు తప్పవని తెలిపారు. సమైక్యపాలనలో ఆంధ్రోళ్లే ముఖ్యమంత్రులుగా ఉండేవారని, ఇక్కడి నిధులను దోచుకొని ఆంధ్ర ప్రాంతాన్ని అభివృద్ధి చేసి తెలంగాణకు పైసా ఇవ్వక అరిగోస పెట్టారని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో కరెంట్ లేక రైతులు పొలాల వద్దే రాత్రిళ్లు పడిగాపులు కాసిన రోజులు ఎలా ఉండేవో గుర్తుంచుకోవాలని సూచించారు. స్వయంపాలనలో సీఎం కేసీఆర్ ఇచ్చిన నిధులతో గొప్పగా అభివృద్ధి చేశామని చెప్పారు.



వేములవాడ బీజేపీ అభ్యర్థిగా తుల ఉమను ఎంపిక చేసి బీ-ఫాంను మరొకరికి ఇవ్వడంపై కురుమలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కరీంనగర్‌లో భారీ ర్యాలీ నిర్వహించి బీజేపీ తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. – కరీంనగర్ కార్పొరేషన్

## కాంగ్రెస్‌కు ఓటేస్తే కుక్కలు చింపిన విస్తరే

- కేసీఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష
- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్
- చొప్పదండిలో బీఆర్ఎస్ వారియర్స్‌తో సమావేశం



గంగాధర మండలం కురిక్యాలలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్. చిత్రంలో ఎమ్మెల్యే సుంకె

కరీంనగర్, నవంబర్ 13(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌కు ఓటేస్తే రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరి అవుతుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం చొప్పదండి నియోజకవర్గంలోని అన్ని మండలాల బూత్ కమిటీల వారియర్స్‌తో ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్‌తో కలిసి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ వారియర్స్ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రతి ఓటరును కలిసి అభివృద్ధి, సంక్షేమ పథకాలు, మ్యానిఫెస్టోను వివరించాలని సూచించారు. ప్రతి వంద మంది ఓటర్లకు ఒక వారియర్ చొప్పున ప్రచారం చేయాలని కోరారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే తెలంగాణలో గత పరిస్థితులు పునరావృతం అవుతాయని హెచ్చరించారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉన్నదని అన్నారు. అన్ని వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేలా ఉన్నదని, మ్యానిఫెస్టో, సంక్షేమ పథకాలను చూసి ఓటువేయాలని కోరారు.


